కథ

# '529'

-రచన: కె.బి. కృష్ణ

**అది పెళ్ళి వారిల్లు. పెళ్ళయి మూడు రోజులైంది.**

**ఆ బెడ్ రూమ్‌లో కొన్ని తరాలుగా కొత్త దంపతుల అనుభూతులను మోసిన పాతకాలపు పందిరి పట్టెమంచాన్ని కనకాంబరం, మల్లెలు, లిల్లీలు, గులాబీలతో అందంగా అలంకరించారు.**

బెడ్ మధ్యలో లవ్ సింబల్ కనకాంబరాలతో డెకొరేట్ చేసి మధ్యలో మన్మథబాణం మల్లెలతో కూర్చారు. గదంతా పళ్ళు, ఫలహారాలు, వివిధ రకాల సెంట్స్, పెర్‌ఫ్యూమ్స్, స్ప్రేల వాసనలతో నిండి వుంది.

ఆ మంచానికి దగ్గరగా ఒక మంచం కోడుకు ఆనుకుని కూర్చుని వుంది అమ్మడు. అంతకు ముందు రోజే ఆమెకు మొదటి రాత్రి అనుభవం అయింది. అమ్మడు మోకాళ్ళలో తలపెట్టుకుని, ఎవరు వెళ్ళి పిలిచినా పలకడం లేదు, తల పైకెత్తడం లేదు.

''ఇదేం చోద్యమో ఏమో చెప్పదు. అల్లుడు గారు బాగానే ఉన్నారు. ఇదేమో మోకాళ్ళలో ముఖం దాచుకుని, తల పైకెత్తడం లేదు: ఏమిటే సంగతి అంటే చెప్పదు'' అమ్మడి తల్లి బాధపడుతోంది.

''అవునమ్మా, విషయం ఏమిటో గట్టిగా మందలించి తెలుసుకోండి. మాయదారిది, ఉన్నది ఒక్కగా నొక్క కూతురు. మంచం మీద పూలు నలగలేదు. అమ్మాయి చీర నలగలేదు. మొదటి రాత్రి అయింది. ఇదేం చోద్యం. అబ్బాయి అబ్బాయేనా లేక అమ్మాయబ్బాయా...'' అంటోంది ఒక బంధువులామె.

''చాల్లెండి. ఊరుకోండి. అవన్నీ వాకబు చేయకుండా పెళ్ళి చేస్తామా ఏమిటి?'' అంటోంది అమ్మడి తల్లి.

''మరి ఎలాగే తల్లీ. లేచి కాస్త కాళ్ళు చేతులు కడుక్కోమను. అసలు సంగతి ఏమిటో తరువాత తెలుసుకుని ఆలోచించవచ్చును -'' అందామె.

''బామ్మ నిన్న రాత్రే వెళ్ళిపోయింది తాత తనను వదలి వుండలేడని. దీనికి బామ్మ మాటంటే గురి ఎక్కువ. బామ్మకోసం కారు పంపించాను. బామ్మ వస్తే అసలు సంగతి తెలుసుకుంటుంది. అప్పటిదాకా టెన్షన్ తప్పదు నాకు -'' అందామె ఆందోళనగా.

ఈలోగా కారు ఆగిన చప్పుడైంది.

''ఏమిటే తల్లీ వెంటనే కారు పంపించావు. ఏమైంది. గుమ్మం దగ్గర కారు ఆగంగానే గుండె ఆగినంత పనైందనుకో -'' అంటూ బామ్మ హడావిడిగా ప్రత్యక్షమైంది. అమ్మడి తల్లి బామ్మను ప్రక్కకు లాక్కెళ్ళి చెవి కొరికింది.

''అదా సంగతి. క్షణంలో దీని సంగతి తేలుస్తా. క్షణం అటు వేపు ఎవరూ రాకండి -'' అంటూ చకచకా అమ్మడి గదిలోకి వెళ్ళి తలుపులు మూసేసింది.

''పిచ్చి మున్నా - ఏమైందిరా?'' అంటూ గారం చేసింది అమ్మడిని.

''బామ్మా...'' అంటూ మోకాళ్ళలోంచి తల పైకెత్తి బామ్మ ఒడిలోపడి ఏడ్వసాగింది అమ్మడు.

''పిచ్చి కొయ్యా - మొదటి రాత్రి అలాగే ఉంటుందే తల్లీ. మగ వాజమ్మలేమో మీద మీదకు వచ్చేస్తారు. అప్పటిదాకా ఆడదాని వాసన తెలియదేమో, మోటుగా పండు కొరుక్కుని తిన్నట్టు తినేయాలని చూస్తారే. అమ్మా అసలు ఏం జరిగిందే తల్లీ - మనవడు మోటు సరసం చేశాడా ఏమిటి? -''

''కాదే -''

''మరి -''

''మరేమో - మరేమో -'' అంటూ సిగ్గుపడసాగింది.

''తలుపులు వేసేశాను. ఎవరూ రారు. మన మాటలు ఎవరూ వినరు. జరిగినదంతా చెప్పు. నా చిట్టి కన్నా. బాధ పడకు. ఏం దాచకుండా చెప్పాలి. నీ బాధకు పరిష్కారం నేను చెప్తాను కదా -''

''బామ్మా - ఎలా చెప్పను -''

''ఈ నోటితో నేనే - ఈ దొండ పళ్ళు మా మనవడు తినకుండా వదిలేశాడేం -'' అంటూ అమ్మడు పెదాలు ముద్దాడింది.

''ఛీ పాడు. ఎంగిలి -''

''అదిగో - పిచ్చికొయ్యా - ఇలాంటి వెధవ మాటలు మాట్లాడి రాత్రంతా వేస్ట్ చేసి వుంటావు -''

''కాదు బామ్మా రాత్రి వేస్ట్ అవలేదే -''

''మరి అదేం చోద్యమే మంచం మీద పూలు నలగలేదు, పళ్ళు ఖర్చవలేదు, ఫలహారాలు తరగలేదు - రాత్రంతా ఏం చేశారే -''

'మరేమో-' మళ్ళీ సిగ్గుపడసాగింది అమ్మడు.

''అదేమరి - చెప్పు -'' అంది బామ్మ.

''బామ్మా, నేను లోపలకు రాగానే, నన్ను గట్టిగా కౌగలించుకుని, మంచిగా కబుర్లు చెబుతూ, కాస్సేపట్లోనే నన్ను వశపరచుకున్నారమ్మా. తనేం చేసినా ఎదురు చెప్పలేకపోయాను -''

''బావుంది - బావుంది - ఆ తరువాత -''

''బామ్మా నీకు సిగ్గులేదే - కప్పుకునే దుప్పటి నేలమీద పరిచారు. క్రింద పడుకుందాం సిగ్గు పడకు అంటూ. ఒక పుస్తకం చూపించారు బామ్మా - దాన్నిండా ఛీ - పాడు బొమ్మలు.''

''ఆ పుస్తకం ఎక్కడ వుందేమిటి? నాకూ చూడాలని వుంది -'' అంది బామ్మ అమ్మడి మాటలకు అడ్డు వచ్చి.

''ఛీ పో బామ్మా - ఆ తరువాత - పాలు త్రాగ కూడదు, పళ్ళు తినకూడదు, స్వీట్సు అవీ తినకూడదు. తింటే పొట్ట బరువెక్కి నిద్ర వచ్చేస్తుంది. రాత్రంతా హాయిగా ఎంజాయ్ చెయ్యలేం. అని నన్ను ఏమీ తిననివ్వలేదు, తాగనివ్వలేదు. తను కూడా అంతే. ఆ పుస్తకంలో అరవై నాలుగు కళలు ఉన్నాయని, అవన్నీ రాత్రికి పూర్తి చెయ్యాలని నేలమీద నన్ను - '' అంటూ సిగ్గుతో మెలికలు తిరిగి పోసాగింది అమ్మడు.

''మా మనవడు మంచి రసికుడే. మరి ఎన్ని కళలు చూశారేం రాత్రి -''

''మాయదారి బామ్మా - అలాంటి పిచ్చి వేషాలు వెయ్యొద్దని చెప్తావని నీతో చెప్తుంటే, ఇంకా ఎన్ని అయ్యాయని అడుగుతావా? నా వళ్ళు హూనం అయిపోయింది. చచ్చే సిగ్గు పాడు -''




''పిచ్చి మున్నా - స్త్రీ పురుషులు పెళ్ళయ్యాక ఆదాము - అవ్వల్లాగా వాళ్ళు దాచుకోకుండా దాంపత్యం కొనసాగిస్తేనే పరిపూర్ణమైన సౌఖ్యం ఉండేది. అంతేకాని ఒకరిని మరొకరు చూడకూడదని అనుకుంటే అంతా చాటు అయిపోయి, దాంపత్యం కూడా మరుగు అయిపోయి, దాంపత్య సుఖానికి, స్వర్గానికి దూరం అయిపోతామే తల్లీ -'' అంటోంది బామ్మ.

''బామ్మా - బామ్మా- '' అంటూ బామ్మను మెల్లగా గుద్దుతూ అరుస్తోంది అమ్మడు.

''ముద్ద బంతి పూవులాగా చక్కగా బలిష్టంగా పల్లెటూరి పాడితో పెరిగావు. మా మనవడు ఎలా చెబితే అలా విని, ఇవాళ అరవై నాలుగు పూర్తి చెయ్యండి. కాని ఈ వేళ రాత్రి మాత్రం మంచం మీద పూలు, వగైరాలు అలా, అలా - చెల్లాచెదరు చెయ్యండి. లేకపోతే అసలు ఏమీ జరగలేదని, మీ అమ్మా నాన్నా, అమ్మలక్కలు గోలపెట్టేస్తున్నారు. ఈ వార్త ఇంకా ఇల్లు దాటకుండా నేను వచ్చాను కాబట్టి సరిపోయింది. లేకపోతే మా మనవడు మగాడు కాదనే వారు ఊళ్ళో వాళ్ళందరూ -'' అంది బామ్మ అమ్మడు బుగ్గలు నొక్కుతూ -

''బామ్మా -'' కోపంతోనూ, సిగ్గుతోనూ బామ్మను గట్టిగా పట్టుకుంది అమ్మడు.

''మనవణ్ణి అప్పుడు మాత్రం ఇలా పట్టుకోకు. కొంచెం వొళ్ళు నెప్పులు అయితేనేం, ఈ సుఖం మళ్ళీ చూడలేవే పిచ్చీ - ఆ పుస్తకం ఒకసారి నాకు కావాలే. నీకు మరో పుస్తకం ఇస్తాను -'' అంది బామ్మ.

''బామ్మా - నీకు సిగ్గు పెట్టలేదు దేముడు.''

''సిగ్గెందుకే - మనమేం తప్పు చేయడం లేదు. మీ తాతయ్య తన దగ్గర వున్న పుస్తకంతో మా ఇంటి దగ్గర మూడు రాత్రుళ్ళు, పగలూ, వాళ్ళ ఇంటి దగ్గర మూడు రాత్రుళ్ళు, పగలూ విశ్రాంతిలేకుండా చంపేశారనుకో -'' బామ్మ సిగ్గు పడుతోంది.

''ఆ పుస్తకంలో ఏముందే -''

''ఆ లైనులోకి వస్తున్నావే తల్లీ. చెప్పనా. తిట్ట కూడదు మరి -''

''తిట్టనులే చెప్పు -''

''అందులో నాడు, వాత్స్యాయనుడు చెప్పిన ఐదు వందల ఇరవై తొమ్మిది కళలు ఉన్నాయట. తాతయ్య చెప్పారు నాకు. తరువాత ఆ కళాపోసన చెయ్యండి.''

''బామ్మా - నిన్ను -'' బామ్మను వొళ్ళో పడుకోబెట్టుకుని చేతులతో కొట్టసాగింది అమ్మడు.

''మరిచానే - అందులో ఒక ఫోజులో మగాడు ఆడదాని వొళ్ళో ఇలాగే -'' బామ్మా నోరు మూసి ''ఛీ - నీకు సిగ్గు లేదు -'' అంటోంది అమ్మడు.

''మరి వస్తానే. ఆ పుస్తకం ఇవ్వడం మర్చిపోకేం. మీ పని అయ్యాక, నీకూ ఆ పుస్తకం ఇస్తాను. మళ్ళీ మొదలెడుదురుగాని -'' అంటూ వెనుక పరుగెత్తుకు వస్తున్న అమ్మడిని తప్పించుకుంటూ బామ్మ చిన్న పరుగుతో బయటకు వచ్చింది.

''ఏంటి బామ్మా, ఏమన్నా చెప్పిందా?'' అంటోంది అమ్మడితల్లి.

''ఏంలేదే పిచ్చికొయ్య - సిగ్గుపడింది. ఎలా మసులుకోవాలో చెప్పాన్లే -''

''మరి పిచ్చి సినిమాలు తెగ చూసేసింది ఏం నేర్చుకుంది. చోద్యం కాకపోతే -'' అందామె. నవ్వుకుంటున్నారు అక్కడ వున్న అమ్మలక్కలు.